సాక్షి
అనంతపురం
ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



23 నుంచి బాబయ్య ఉత్సవాలు

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ప్రసిద్ధ బాబయ్య దర్గా ఉత్సవాలు ఈ నెల 23న ప్రారంభం కానున్నాయి. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం 30.2°/ 19.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

దూరవిద్య యూజీ ఫలితాలు విడుదల



ఫలితాలను ప్రకటిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూరవిద్య యూజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ శనివారం విడుదల చేశారు. బీఏలో మొత్తం 157 మంది రాయగా, 114 మంది (72.61 శాతం), బీకాంలో 44 మందికి గాను 22 మంది (50 శాతం), బీకాం కంప్యూటర్స్/బీబీఏలో మొత్తం 148 మందికి గాను 103 మంది (69.59 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వచ్చే జనవరి 6న రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రీవాల్యుయేషన్‌కు సంబంధించి ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున ఫీజు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ అన్బురాజన్‌కు డీజీపీ డిస్క్ అవార్డు



ఎస్పీకి అవార్డు ప్రదానం చేస్తున్న డీజీపీ

అనంతపురం క్రైం: శాంతిభద్రతల పరిరక్షణ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ తదితర విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను ప్రతిష్టాత్మక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డిస్క్ అవార్డు వరించింది. శనివారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రదానం చేశారు. కన్విక్షన్ బేస్ పోలీసింగ్ విధానాన్ని ఎస్పీ అన్బురాజన్ సమర్థవంతంగా నిర్వహించి కీలక కేసుల్లోని ముద్దాయిలకు వంద శాతం శిక్షలు పడేలా కృషి చేశారు.

గ్రూప్‌-1, 2 పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం రూరల్: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్ 1, 2 ప్రిలిమనరీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జ్ ఉపసంచాలకులు కుష్బూకొఠారి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రూప్‌-2 శిక్షణకు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వీరికి ఈ నెల 27 నుంచి శిక్షణ తరగతులుంటాయి. అలాగే గ్రూప్‌-1 శిక్షణకు ఈ నెల 31 తేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి 5 నుంచి శిక్షణ ఉంటుంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బయోడేటాతో పాటు పది, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ నకళ్లతో రెండు ఫొటోలను జతపరిచి నిర్ణీత గడువులోపు బీసీ స్టడీ కార్యాలయంలో అందజేయాలి.

వ్యవ'సాయం'లో రైతుకు జగన్ సర్కారు అండగా నిలుస్తోంది. ఏటా మూడు విడతల్లో వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద రూ.13,500 చొప్పున ఖరీఫ్– రబీ పంటల సాగుకు పెట్టుబడి సాయం అందిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ), వైఎస్సార్ ఉచిత పంటల బీమా (ఇన్సూరెన్స్) అందించి ఆదుకుంటోంది. బ్యాంకు రుణాల్లోనూ అన్నదాతలకు పెద్దపీట వేయిస్తూ ప్రోత్సాహమందిస్తోంది.



ఇతోధికంగా వ్యవసాయం

- అన్నదాతకు రూ.6 వేల కోట్ల పంటరుణం
- గత ఖరీఫ్‌లో భారీగా రెన్యూవల్స్, కొత్త రుణాల పంపిణీ
- వ్యవసాయ అనుబంధ రంగాలకూ పెద్ద ఎత్తున ప్రోత్సాహం
- చిన్న తరహా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు రుణసదుపాయం
- రూ.15,848 కోట్ల వార్షిక రుణప్రణాళికలో 72 శాతం పురోగతి
- అన్ని రంగాలకూ రూ.11,412 కోట్లు పంపిణీ చేసిన బ్యాంకులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఏటా బ్యాంకుల ద్వారా రైతులకు పంట రుణాల రెన్యూవల్స్, కొత్త రుణాల పంపిణీకి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూడా పంట రుణాలు అంచనాకు మించి పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది అన్ని రంగాలు, అన్ని వర్గాలకు బ్యాంకుల ద్వారా రూ.15,848 కోట్ల రుణాలు ఇవ్వాలని వార్షిక రుణ ప్రణాళిక కింద కార్యాచరణ రూపొందించారు. అందులో ఖరీఫ్ ముగిసిన రెండో త్రైమాసికానికి 72 శాతం లక్ష్యసాధనలో రూ.11,412 కోట్ల రుణవితరణ పూర్తి చేశారు. డిసెంబర్ నెలాఖరుకు మూడో త్రైమాసికం ఫలితాలు వెల్లడికానుండగా 2024 మార్చి నెలాఖరుకు ఆర్థిక సంవత్సరం పూర్తి కానుంది. అంతలోపు వందశాతానికి పైగా రుణప్రణాళిక పూర్తవుతుందని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యరాజా తెలిపారు.

రూ.6 వేల కోట్ల పంట రుణాలు

వార్షిక రుణప్రణాళికలో పంట రుణాలకే అగ్రతాంబూలం ఇచ్చారు. ఖరీఫ్, రబీ కింద రూ.7,742 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా సెప్టెంబర్ నెలాఖరుకే 78 శాతంతో రూ.6,014 కోట్లు ఇవ్వడం విశేషం. మిగతా 22 శాతం రుణాలు రబీకి కేటాయించడంతో అది కూడా పూర్తవుతుందని లీడ్‌బ్యాంకు వర్గాలు తెలిపాయి. ప్రజల అవసరాలు, ప్రభుత్వ పథకాలు పెరగడంతో వాటిని దృష్టిలో పెట్టుకుని ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా బ్యాంకింగ్ నెట్‌వర్క్ బాగా పెరిగింది. ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంకులతో పాటు సహకార, గ్రామీణ బ్యాంకులు దాదాపు 43 ప్రిన్సిపల్ బ్యాంకులు, వాటి పరిధిలో 285 బ్యాంకు శాఖల ద్వారా రుణవితరణ, డిపాజిట్ల సేకరణ లాంటి బ్యాంకింగ్, వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నాయి. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రుణాల మంజూరులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ), స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పోటీపడుతూ మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. ఆ తర్వాత యూనియన్ బ్యాంకు, కెనరాబ్యాంకు, ఇండియన్ బ్యాంకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), బ్యాంకు ఆఫ్ బరోడా, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంకు, కరూర్ వైశ్యాబ్యాంకు, ఐడీబీఐ తదితర ప్రభుత్వ, ప్రైవేట్, సహకార, గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి.

మిగతా రంగాలకూ ప్రాధాన్యత

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట రుణాల మంజూరుకు పెద్దపీట వేస్తున్న బ్యాంకర్లు... మిగతా రంగాలకూ ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు లీడ్‌బ్యాంకు మేనేజర్ తెలిపారు. ఈ ఏడాది వ్యవసాయ టర్మ్‌లోన్ల కింద ఇప్పటికే రూ.1,810 కోట్లు, ఇక అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.20 కోట్లు వ్యవసాయ అనుబంధ రంగాల కింద రూ.264 కోట్లు ఇచ్చారు. ఇలా మొత్తంగా కేవలం వ్యవసాయ, అనుబంధ రంగాల కింద రైతులు, ఇతర లబ్ధిదారులకు రూ.8,108 కోట్లకు పైగా మంజూరు చేయడం గమనార్హం. వీటితో పాటు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహం కింద రూ.1,444 కోట్లకు పైగా మంజూరు చేశారు. విద్య, వాహన, హౌసింగ్ తదితర నాన్‌ప్రయార్టీ సెక్టార్ కింద కూడా ఇప్పటికే రూ.1,717 కోట్లకు పైగా రుణాలు ఇచ్చారు.

ఈ ఏడాది వార్షిక రుణప్రణాళిక లక్ష్యం, సెప్టెంబర్ నెలాఖరుకు సాధించిన ప్రగతి ఇలా

రంగం	2023-24 లక్ష్యం	సాధించిన ప్రగతి
ఖరీఫ్,రబీ పంట రుణాలు	రూ.7,742 కోట్లు	రూ.6,014.18 కోట్లు
అగ్రికల్చర్ టర్మ్‌లోన్లు	రూ.3,047 కోట్లు	రూ.1,810.39 కోట్లు
అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	రూ.72 కోట్లు	రూ.19.84 కోట్లు
అగ్రి అలైడ్ రంగాలకు	రూ.191 కోట్లు	రూ.263.93 కోట్లు
కుటీర పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)	రూ.1,962 కోట్లు	రూ.1,444.38 కోట్లు
ఇతర ప్రాధాన్యత రంగాలు	రూ.647 కోట్లు	రూ.141.82 కోట్లు
నాన్ ప్రయారిటీ సెక్టార్	రూ.2,188 కోట్లు	రూ.1,717.50 కోట్లు
మొత్తం	రూ.15,848 కోట్లు	రూ.11,412.04 కోట్లు

55 వేల హెక్టార్లలో రబీ



పప్పుశనగ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీ పంటలు మందకొడిగా సాగాయి. ప్రధానపంట పప్పుశనగ సాగుకు కీలకమైన అక్టోబర్, నవంబర్‌లో 130 మి.మీ గాను 50 మి.మీ మేర వర్షపాతం నమోదు కావడంతో సాగుకు అంతరాయం ఏర్పడింది. అరకొర వర్షాల నడుమ 1.21 లక్షల హెక్టార్లకు గాను 55 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి. 78,163 హెక్టార్లు అంచనా వేసిన పప్పుశనగ సరిగ్గా 50 శాతంతో 39,295 హెక్టార్లలో వేశారు. మరో ప్రధానపంట వేరుశనగ 20,448 హెక్టార్లకు గాను 8,440 హెక్టార్లలో సాగైంది. వరి 7,743 హెక్టార్లకు గానూ 300 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేశారు. మొక్కజొన్న 6,980 హెక్టార్లకు గాను 3,140 హెక్టార్లు, జొన్న 4,027 హెక్టార్లకు గాను 3,470 హెక్టార్లు, ఉలవ 1,604 హెక్టార్లకు గాను 2,007 హెక్టార్లలో వేశారు. వీటితో పాటు సజ్జ, పెసర, అలసంద, మినుము, ఆముదం, పొద్దుతిరుగుడు, తెల్లకుసుమ తదితర పంటలు కొంత విస్తీర్ణంలో సాగు చేశారు. ఉలవ మినహా తక్కిన పంటలన్నీ సాధారణం కన్నా చాలా తక్కువ విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలకు నెలాఖరుకు వరితో పాటు మరికొన్ని పంటలు కొంత విస్తీర్ణం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. సాగు చేసిన పప్పుశనగ చాలా ప్రాంతాల్లో దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు.

22 వేల ఎకరాల పంట నమోదు

రబీ పంటలకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు ఈ–క్రాప్, ఈ–కేవైసీ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 22 వేల ఎకరాలు ఈ–క్రాప్‌లో నమోదైనట్లు తెలిపారు. జనవరి మొదటి వారంలోపు వంద శాతం ఈ–క్రాప్ పూర్తికి చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ 'సాక్షి'కి తెలిపారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట

- విద్యార్థుల్లో ఆధ్యాత్మికత పెంపొందించాలి
- కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్
- ఆర్ట్స్ కళాశాలలో ప్రజ్ఞ యాన్యువల్ ఫెస్ట్



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న పోలా భాస్కర్, వీసీ జింకా రంగ జనార్దన

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. విద్యార్థులకు మానసిక, మేధస్సు సంబంధిత అంశాలతో పాటు ఆధ్యాత్మికతనూ పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాలలను ప్రోత్సహించడానికి కళాశాల విద్య తొలిసారిగా 'ప్రజ్ఞ యాన్యువల్ ఫెస్ట్–2023'ను శనివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన పోలా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులను ప్రోత్సహించి ఉన్నత విద్యరంగాల్లో మరిన్ని నూతన ఆవిష్కరణలు, సాధించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసించే వారి సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెరగాలంటే కేవలం మౌలిక సదుపాయాలు ఉంటే సరిపోదన్నారు. అందరినీ బాగు చేయాలనే సంకల్పం ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే విద్యార్థిలో సంపూర్ణ వికాసం సాధ్యమవుతుందన్నారు. తరగతి బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. వీటితో పాటు సామాజిక భావోద్వేగాలను సమతుల్యం చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక 'జాబ్ పోర్టల్' ఏర్పాటు చేశామన్నారు. ఇందులో వెయ్యి కంపెనీలు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జేఎన్‌టీయూ వీసీ జింకా రంగ జనార్దన మాట్లాడుతూ ప్రపంచంలో మనదేశం యువశక్తిగా దూసుకుపోతోందన్నారు. మేధస్సు పరంగా అభివృద్ధి సాధించామని, అయితే మన ఆలోచనలు వాస్తవ రూపంలోకి ముఖ్యంగా వస్తు ఉత్పత్తిలోకి తీసుకురాలేక పోతున్నామన్నారు. కొన్నేళ్లుగా మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే చెప్పుకుంటున్నామన్నారు. మన ఆలోచనలను పేటెంట్స్‌గా తీసుకొచ్చి వస్తు ఉత్పత్తిలో ప్రగతి సాధిస్తే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. యువత ముందుకొచ్చి జాతినిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సైకాలజిస్ట్ వీరేందర్ మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ అంశాల్లో ఎంపికైన 150 మంది విద్యార్థులు, అధ్యాపకులకు కమిషనర్, వీసీ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, కళాశాల విద్య అధికారి తులసి, ఆర్జేడీలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఓట్లేసిన ప్రజలనే పీడిస్తున్నారు

- 25 ఏళ్లుగా పరిటాల కుటుంబం ప్రజలకు చేసింది అన్యాయమే
- మేము అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని వివరిస్తే మీడియా వక్రీకరించింది
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: నమ్మి ఓట్లేసిన ప్రజలను పరిటాల కుటుంబం అన్ని విధాలుగా పట్టి పీడిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. పాతికేళ్ల కాలంలో పరిటాల కుటుంబం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అయితే నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి ప్రజలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. పరిటాల సునీత శాడిజం కారణంగానే రోడ్ల అభివృద్ధి జరగలేదన్నారు. తాను ఇదే విషయాన్ని స్పష్టంగా చెబితే కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించాయని మండిపడ్డారు. అనంతపురంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్న ఆశీస్సులతో నియోజకవర్గంలో 17 వేల ఇళ్లను మంజూరు చేయించుకున్నామన్నారు. మరో 8 వేల ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు గుర్తు చేశారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేసేందుకు రూ.150 కోట్లు మంజూరు చేయించామన్నారు. అనంతపురం–తగరకుంట రోడ్డును ఎన్నికల్లోపు పూర్తి చేస్తామన్నారు. తోపుదుర్తి రిజర్వాయర్ నిర్మాణ పనులు కూడా ఎన్నికల్లోపు ప్రారంభిస్తామన్నారు.

రోడ్ల పాపం సునీతదే

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో 52 రోడ్ల పనులను 2018లో పరిటాల కుటుంబానికి చెందిన ఎస్కేసీ కంపెనీ దక్కించుకుందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని 19 రోడ్లకు గాను 16 పూర్తి చేశారని, రాప్తాడు నియోజకవర్గంలో 33 రోడ్లకు గాను మూడు మాత్రమే పూర్తి చేశారన్నారు. పాతికేళ్ల రాజకీయ భిక్ష పెట్టిన రాప్తాడు నియోజకవర్గ ప్రజలపై పరిటాల కుటుంబం చూపిస్తున్న కపట ప్రేమకు ఇంతకన్నా నిదర్శనమేముంటుందన్నారు. ఏవైతే రోడ్లు పెండింగ్‌లో పెట్టారో ఆయా గ్రామాలకు పరిటాల సునీత వచ్చినప్పుడు నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రోడ్లు పూర్తి చేసిన తర్వాతనే గ్రామంలోకి కాలు పెట్టాలని చెబుతూ ప్రజాస్వామ్య పద్ధతిలోనే నిరసన తెలపాలన్నారు. అప్పటికీ రోడ్లు వేయకపోతే ఓటు అనే ఆయుధంతో మరోమారు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు.

చచ్చేదాకా ప్రజా సేవలోనే

తాను చచ్చేదాకా రాప్తాడు నియోజకవర్గ ప్రజల సేవలోనే తరిస్తానని ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. దాతల సహకారంతో పాటు వ్యక్తిగత సంపాదనతో అనేక సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ వచ్చామన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చేందుకు కాలువలు, బోగినేపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు అందించేందుకు కాలువలు తవ్వించామన్నారు. గంగలకుంట, లింగనపల్లి, బొమ్మేపర్తి చెరువులకూ కాలువలు తవ్వించామన్నారు. పాడి రైతులను ఆదుకునేందుకు అమ్మ డెయిరీ ప్రారంభించామన్నారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు అండగా నిలబడ్డామన్నారు. ఆలయాల అభివృద్ధి, చావులు, అనారోగ్యాలు, చదువులు ఇలా ఎవరికి ఏ అవసరమున్నా తమ ముగ్గురు అన్నదమ్ములం అండగా నిలిచామన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను ప్రేమతో గెలిపించుకున్నారని, తాను కూడా అంతే ప్రేమతో రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నానన్నారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, నాయకులు కె.ధనుంజయాదవ్, చిత్రా వెంకటేష్, దుగుమర్రి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

సర్వే కోర్సుపై ఉచిత శిక్షణ

అనంతపురం: డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్, సర్వే కోర్సుపై రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 'స్కిల్ హబ్ సెంటర్'లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, డిప్లొమో, ఎంబీఏ, ఎంకాం పూర్తి చేసిన వారు అర్హులు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 91829 20381లో సంప్రదించవచ్చు.

విద్యార్థులకు 18న పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 18న వివిధ పోటీలు నిర్వహించాలని డీఈఓ వి.నాగరాజు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ–కామర్స్, డిజిటల్ వర్తకంలో వినియోగదారుల రక్షణ' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 'వినియోగదారుల హక్కులు, ఈ కామర్స్, డిజిటల్ చెల్లింపులు, వినియోగదారుల హక్కుల రక్షణ'పై క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు 21న జిల్లాస్థాయి పోటీలు ఉంటాని, వివరాలకు 94418 23923, 89859 34531 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

23 నుంచి పెనుకొండ బాబయ్య దర్గా ఉత్సవాలు



అనంతపురం కల్చరల్: పెనుకొండ బాబయ్య స్వామి 751వ ఉరుసు ఉత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆత్మీయ అతిథిగా శనివారం అనంతపురానికి విచ్చేసిన పెనుకొండ పీఠాధిపతి సజ్జాద్‌బాబా.. నగర మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్‌తో కలసి పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. 23న బాబయ్యస్వామి చదివింపులతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. ఆదివారం సాయంత్రం ఆలం కుషాయి జెండాలను ఎక్కించుట, 25న మొదటి గంధం పూజ రాత్రి నుంచి తెల్లవారు జాము వరకూ జరుగుతుందన్నారు. 26న ఖవాలీ పోటీలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, 28న బాబయ్య స్వామి ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 29న సాహెబ్ సజ్జాద్ వారి తాత హజరత్ మౌలానా మౌల్వి ఖ్వాజా సయ్యద్ షా బాబా జియావుద్దీన్ హుస్సేనీ సహేరి పూజ జరుగుతుంది. ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, ఐఎంఎం మహబూబ్‌బాషా, మసూద్‌బాషా, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు నిజాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమామ్, జాకీర్, షబ్బీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

'తమ్ముడి' బరితెగింపు

- దర్గాగా చెరువు స్థలం కబ్జా



చెరువు స్థలాన్ని చదును చేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: ఓ టీడీపీ కార్యకర్త బరితెగించాడు. దర్గాగా చెరువు స్థలాన్ని కబ్జా చేస్తున్నాడు. పద్ధతి కాదని చెబితే దౌర్జన్యం చేస్తున్నాడు. వివరాలు.. మండల పరిధిలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకట్రాముడు చెరువు స్థలాన్ని ఆక్రమిస్తున్నాడు. తన పొలంలో కలిసేలా చదును చేస్తున్నాడు. చెరువులో జేసీబీతో కొన్ని రోజులుగా గట్లు వేసుకుంటున్నాడు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో చెరువులో పూడిక తీత పనులు చేయించారు. సమీపంలోని బోరు బావుల్లో భూగర్భ జలం పెరిగేలా చర్యలు చేపట్టారు. అయితే, దౌర్జన్యంగా గుంతలను యంత్రాలతో పూడ్చి వేస్తుండడంతో గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వాగ్వాదం చేస్తున్నాడని వాపోయారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తప్పొకరిది... శిక్ష మరొకరికి

- జాతీయ రహదారి 544డి నిర్మాణంలో కోల్పోతున్న పక్కా గృహాలు
- నివాసాలను రాళ్ల గుట్టగా నమోదు చేసిన వైనం
- నిర్వాసితులకు శాపంగా మారిన బీకేఎస్ రెవెన్యూ అధికారుల నిర్వాకం
- ఆందోళనలో 47 కుటుంబాలు



జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోటరీపురంలో కోల్పోనున్న ఇళ్లు

అనంతపురం అర్బన్: రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదానికి ఏకంగా 47 కుటుంబాలు వీధిన పడుతున్నాయి. పక్కా గృహాలను నిర్మించుకుని దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా నివాసముంటున్న పేదలకు 40 ఏళ్ల క్రితమే డి.పట్టాలను మంజూరు చేసింది. తాజాగా ఆ ప్రాంతంలో చేపట్టిన 544డీ జాతీయ రహదారి పనుల్లో 130 పక్కా గృహాలను తొలగించాల్సి వస్తోంది. ఇందులో 47 కుటుంబాలకు మినహాయించి మిగిలిన అందరికీ పరిహారం అందుతోంది. దీంతో బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామానికి చెందిన నిర్వాసితుల్లో ఆందోళన నెలకొంది.

రాళ్ల గుట్టగా నమోదు

అనంతపురం రూరల్ మండలం పాములరాయి నుంచి తాడిపత్రి మండలం బుగ్గ వరకూ 544–డి జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నిర్మాణ క్రమంలో బీకేఎస్ మండలం రోటరీపురం గ్రామంలో దాదాపు 130 ఇళ్లను తొలగించాల్సి వస్తుందని గుర్తించారు. ఈ క్రమంలో నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఇళ్లను కొలిచి నిర్మాణ విలువను నిర్ధారించారు. అయితే రికార్డులు సిద్ధం చేసే క్రమంలో 130 ఇళ్లలో 47 ఇళ్లకు సంబంధించిన సర్వే నంబర్ 112–2ను రాళ్లగుట్టగా రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. వాస్తవానికి ఈ 47 ఇళ్లలో నివాసముంటున్న వారు 50 ఏళ్ల క్రితమే అక్కడ పక్కా గృహాలు నిర్మించుకున్నారు. 1978లోనే ఈ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయి. ఈ క్రమంలో 1983లో వీరికి డి.పట్టాను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. అయితే పరిహారం ఇచ్చేందుకు సిద్ధం చేసిన రికార్డుల్లో ఈ సర్వే నెంబర్‌ను రాళ్లగుట్టగా నమోదు చేయడమే కాక కాక ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ పరిహారం 'సున్న'గా అనెక్జర్‌లో పొందుపరిచారు. 2018, 2019లో అవార్డు ప్రదాన సమయంలోనూ అధికారులు తాము చేసిన తప్పిదాన్ని సరిచూసుకోలేదు. దీంతో ఈ 47 ఇళ్లకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది.

చేతులు కాలాక....

'చేతులు కాలాక, ఆకులు పట్టుకోవడం' అన్న చందంలా మారింది ప్రస్తుతం రెవెన్యూ అధికారుల తీరు. తమ తప్పును తెలుసుకుని సరిదిద్దుకుని మరో మారు నివేదికను సిద్ధం చేసి పంపినా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ, జాతీయ రహదారులు (మోర్త్) ఆమోదం తెలపలేదు. 47 ఇళ్లకు తప్ప మిగిలిన నిర్వాసితులకు ఇప్పటికే నిర్ధారించిన కట్టడ విలువకు రెట్టింపు పరిహారాన్ని మంజూరు చేయడమే కాక ఆ మొత్తాన్ని నిర్వాసితుల ఖాతాల్లోకి జమ చేసింది. దీంతో 47 నిర్వాసిత కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీంతో ఈ సమస్యను ఎలా పరిష్కరించి నిర్వాసితులకు న్యాయం చేయాలనేదానిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కసరత్తు చేస్తున్నారు.

వీధినపడాల్సిందే



రోటరీపురంలో పక్కా ఇంటిని నిర్మించుకుని 50 ఏళ్లుగా నివాసముంటున్నాం. 1983లోనే మాకు పట్టాలు ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో 130 ఇళ్లను తొలగిస్తున్నారు. మా ఇళ్లనూ కొలతలు వేశారు. అయితే మా 47 కుటుంబాలు నివాసముంటున్న ప్రాంతాన్ని రాళ్లగుట్టగా నమోదు చేయడంతో పరిహారం అందకుండా పోయింది. పరిహారం అందకపోతే ఇళ్లు కోల్పోయి మా కుటుంబాలు వీధిన పడతాయి. అధికారులే మాకు న్యాయం చేయాలి. – కిష్ట, నిర్వాసితుడు, రోటరీపురం

మాకూ పరిహారమివ్వాలి



గ్రామంలో ఇళ్లను కోల్పోతున్న వారికి పరిహారం ఏరీతిన ఇచ్చారో మాకు అలాగే ఇవ్వాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బతకడమే కష్టంగా ఉంది. ఇంటిని కోల్పోతే తిరిగి కట్టుకునే స్థోమత మాకు లేదు. ఈ విషయంలో అధికారులే మాకు న్యాయం చేసి పరిహారం వచ్చేలా చూడాలి.

– వెంకటనాయుడు, నిర్వాసితుడు, రోటరీపురం

ప్రతిపాదనలు పంపాం



నిర్వాసితులకు పరిహారం మంజూరు విషయంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. పరిస్థితి మొత్తం నేషనల్ హైవేకు సంబంధించిన స్టేట్, సెంట్రల్ ఆఫీసుకు వివరించాం. వారికి దీనిపై సందేహాలున్నాయి. వాటిని కూడా నివృత్తి చేశాం. ఇదే అంశంపై వచ్చే వారం వారు సమావేశం పెడుతున్నారు. సమస్య పరిష్కారం అవుతుంది. – కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

జనవాక్కు

పాఠశాలల రూపురేఖలు మారాయి



గత ప్రభుత్వ పాలనతో పోల్చుకుంటే సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ విద్య బలపడింది. మనబడి నాడు-నేడు కార్యక్రమంతో ఉద్దేహాల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గతంలో విద్యార్థులు కూర్చొనేందుకు కూడా గదులు ఉండేవి కాదు. చెట్ల కిందే కూర్చోబెట్టి పాఠాలు చెప్పేవాళ్లం. ఈ రోజు ఆ పరిస్థితి లేదు. ఆహ్లాదకరమైన వాతావరణం, మౌలిక వసతులు సమకూరడంతో ఒకప్పుడు 350 విద్యార్థులు మాత్రమే ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 860 మంది చదువుకుంటున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడ్డాయి. తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు.

– శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

బతుకులు బాగుపడ్డాయి



రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న బాధ్యతలు తీసుకున్న తర్వాత మా కుమారుడిని చదివించుకోగలుగుతున్నాం. అమ్మ ఒడి పథకంతో వాడి బంగారు భవిష్యత్తుకు జగనన్న బాటలు వేశారు. అలాగే వాహన మిత్ర పథకం లబ్ధి చేకూరింది. అయా పథకాల కింద వచ్చిన డబ్బును పోగు చేసి సొంతంగా ఆటో కొనుగోలు చేశాం. ఇప్పుడు మా బతుకులు బాగుపడ్డాయి. ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. సీఎం వైఎస్ జగనన్న చేసిన సాయాన్ని మరువలేం. ఆయనకు అండగా నిలుస్తాం.

– సుహాసిని, ఉదిరిపికొండ, కూడేరు మండలం

ఇంటి వద్దకే సర్టిఫికెట్లు



గతంలో ఏదైనా సర్టిఫికెట్ అవసరమైతే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. మా ఊళ్లోనే వలంటీర్‌కు చెబితే దరఖాస్తు తీసుకెళ్లి మాకవసరమైన సర్టి ఫికెట్ ఇంటి వద్దకే తెచ్చిస్తున్నాడు. అంతేకాక జగనన్న సురక్ష కార్యక్రమం కింద మాకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. సీఎం వైఎస్ జగన్ మేలు ఎన్నటికీ మరువం.

– బోయ పార్వతి, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

మేలు మరువలేం



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా పేదల బతుకులు మారలేదు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత అమలు చేస్తున్న పథకాలతో పేదల బతుకుల్లో సమూల మార్పులు వచ్చాయి. ఇంటి వద్దకే వచ్చి ఎలాంటి సర్టిఫికెట్లు కావాలో అడిగి తెలుసుకుని వాటిని ఒక్క రోజులోనే ఉచితంగా అందజేశారు. ఇంత గొప్ప పాలనను మేము ఉన్నడూ చూడలేదు. మాలాంటి పేదలకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం జగనన్న మేలు మరువలేం.

– రామాంజినమ్మ, శ్రీధరఘట్ట, బొమ్మనహాళ్ మండలం

64 కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి గోవాకు రైలులో తరలింపు
- గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జీఆర్పీ సీఐ నగేష్‌కుమార్



పట్టుబడ్డ గంజాయిని, నిందితుడిని చూపుతున్న రైల్వే పోలీసులు

గుంతకల్లు: రైలు మార్గంలో అక్రమంగా రవాణా చేస్తున్న 64 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని జీఆర్పీ సీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆర్పీఎఫ్ సీఐ బెనయ్యతో కలసి జీఆర్పీ సీఐ నగేష్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం రాత్రి గుంతకల్లు జంక్షన్‌లోని 7వ ప్లాట్‌ఫారంలో ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో జీఆర్పీ సిబ్బంది గుర్తించి ప్రశ్నించారు. ఆ సమయంలో ఓ వ్యక్తి పారిపోయాడు. రెండో వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో భద్రంగా ప్యాక్ చేసిన 64 గంజాయి ప్యాకెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. విచారణలో తన పేరు శిభిరామ్ ప్రధాన్‌గా నిందితుడు తెలిపాడు. ఒడిశాలోని గంజిమ్ జిల్లా రాయపల్లి నివాసిగా పేర్కొన్నాడు. పరారైన స్నేహితుడి పేరు ప్రఫూల్‌శెట్టిగా వివరించాడు. గంజాయి ముఠా సభ్యులు వీరికి సుపారి కింద రూ.15 వేలు ఇచ్చి రైళ్లలో గోవాకు గంజాయి సరఫరా చేసేవారు. ఈ నేపథ్యంలో ఇరువురూ గంజాయి ప్యాకెట్లు తరలిస్తూ గుంతకల్లు జంక్షన్‌లో దిగి గోవా వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కేందుకు 7వ ప్లాట్‌ఫారం పైకి చేరుకుని జీఆర్పీ సిబ్బందికి పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.8.96 లక్షలుగా ఉంటుందని నిర్ధారించారు. పరారీలో ఉన్న ప్రఫూల్ శెట్టి కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు జీఆర్పీ సీఐ నగేష్‌కుమార్ తెలిపారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఆర్పీఎస్ఐ మహేంద్ర, హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వర రావు, కానిస్టేబుళ్లు గాదిలింగ, ప్రకాష్, అలీ, నబీ. పుల్లయ్య, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎం వీరేష్, ఆర్పీఎఫ్‌లు జె.సూరినాయుడు, కేఎస్ వరప్రసాద్‌ను జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరీ ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఉరవకొండ: ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



కళ్యాణదుర్గం రూరల్: ఎంపికైన విద్యార్థులతో నార్త్ స్కూల్ ఉపాధ్యాయులు

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సంధ్య రాష్ట్ర స్థాయి వాక్ రేస్ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయిందని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ విద్యార్థిని సంధ్య 3, 5 కిలోమీటర్ల వాక్ రేస్ పోటీలకు సంబంధించి జాతీయస్థాయిలో పోటీపడుతుందన్నారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న కీర్తన వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో మెడల్ సాధించిందన్నారు. అలాగే భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకలసందర్భంగా పుట్టపర్తిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో మైత్రి, నిఖిల, స్పందన, సృజన సాయి ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, సుధారాణి, గ్రంథాలయాధికారి కుళ్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు..

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని నార్త్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు కృష్ణ చరణ్, సాయి చరణ్‌ను శనివారం ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు గుంటూరు జిల్లాలోని తెనాలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గాయిత్రి, ఫిజికల్ డైరెక్టర్ చల్లా కిరణ్, ఉపాధ్యాయులు ప్రవీణ్, శివన్న, షకీలా పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న స్ప్రింక్లర్లను చూపుతున్న ఎస్ఐ సత్యనారాయణ

కూడేరు: రైతులు పొలాల్లో ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పరికరాలను అపహరించుకెళ్లే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు కూడేరు ఎస్ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. మండలంలోని కొర్రకోడులో ఇటీవల తుంపర సేద్యం పరికరాలను దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, తిరుపాల్‌ను శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 స్ప్రింక్లర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేయడానికి అర్హులైన ఎస్సీ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అన్నాదొరై శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఏడాది పాటు బోధించడానికి అర్హులైన వారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో రెండు ఉపాధ్యాయ, ఒక అధ్యాపక పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఉమ్మడి అనంతపురం జిల్లాల అభ్యర్థులు తమ దరఖాస్తులను అనంతపురం నవోదయ కాలనీలోని గిరిజన గురుకుల పాఠశాలలో అందించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9948100343, 8309005097 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తడబడ్డ ఆంధ్రా



విస్తల్ తివారీ (91 పరుగులు)



మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

అనంతపురం: బీసీసీఐ కూచ్ బెహార్ ట్రోఫీలో భాగంగా అనంత క్రీడాగ్రామం వేదికగా ఆంధ్ర – జార్ఖండ్ జట్ల మధ్య శనివారం జరిగిన మల్టీడే మ్యాచ్‌లో ఏపీ జట్టు రెండో రోజే తడబడింది. 249 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. ఎస్కే మహమ్మద్ తౌఫిక్ 65, సుకాంత్ 78 (9ఫోర్లు, 1 సిక్సర్) ఎం. అభినవ్ 20 పరుగులు చేశారు. తౌఫిక్, సుకాంత్ 133 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు దక్కింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడిన జార్ఖండ్ జట్టు 73 ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 188 పరుగులు చేసింది. విస్తల్ తివారీ 91 పరుగులు (7ఫోర్లు), వివేక్ కమార్ 69 పరుగులు (7 ఫోర్లు, ఒక సిక్సర్) మంచి భాగస్వామ్యం నెలకొల్పి క్రీజ్‌లో కొనసాగుతున్నారు. అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి మ్యాచ్‌ను ప్రారంభించారు. రెఫరీగా సంజయ్‌వర్మ వ్యవహరించారు.

జూదరుల అరెస్టు



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామ అటవీ ప్రాంతంలో పేకాటరాయుళ్లపై శనివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 మందిని అరెస్టు చేసి, ఐదు ద్విచక్ర వాహనాలు, 53,160 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ శివాలయం వీధిలో శనివారం ఉదయం రెండు ఇళ్లలో చోరీ జరిగింది. బండల వ్యాపారి హాజీవలి ఇంటి తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు 17 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. అలాగే బండల ఫ్యాక్టరీలో పని చేసే కార్మికుడు హుస్సేన్ బాషా ఇంటి తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించిన ఆగంతకులు రూ.25వేలు నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా ఘటనలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎస్కేయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

అనంతపురం: భారత రక్షణ, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకూ హిమాచల్ ప్రదేశ్‌లో చేపట్టిన ఎన్ఎస్ఎస్ జాతీయ సాహస శిక్షణ శిబిరానికి అనంతపురంలోని ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎం.బోలోనాథరెడ్డి, ఎస్.సింధు ఉన్నారు. వీరిని ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యు.ధనుంజయ అభినందించారు.

గుంతలో పడి మహిళ మృతి

లేపాక్షి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న వడ్లోళ్ల బండ గుంతలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు. వివరాలు.. శనివారం మధ్యాహ్నం గుంతలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా చేశారు. లేపాక్షి గ్రామానికి చెందిన రత్నమ్మ (45)గా గుర్తించారు. కొంత కాలంగా మతిస్థిమితం లేక అక్కడక్కడా నీరుండే చోట్ల తిరిగేదని తెలిసింది. మృతురాలికి కుమారుడు, కోడలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న అకడమిక్ ఫెస్ట్





విద్యార్థుల నృత్య ప్రదర్శన



సంప్రదాయ, జానపద నృత్యాలతో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు అదరకొట్టారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి 'అకడమిక్ ఫెస్ట్' సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అద్భుత ప్రదర్శనతో అలరించారు. ముఖ్యంగా జానపద నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. కోలాటం, మంగ్లీ పాటలకు చేసిన డ్యాన్సులు విద్యార్థుల్లో ఉత్సాహం నింపాయి.

– అనంతపురం ఎడ్యుకేషన్

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ముత్యాలప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కళ్లు పోగొట్టుకొన్న వేపకుంట ముత్యాలప్ప కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని వేపకుంటలో ఎమ్మెల్యే పర్యటించారు. మొదట గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీరాములు నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముత్యాలప్పను పరామర్శించి, వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఆత్మకూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయమని ఎంపీపీ హేమలత తెలిపారు. శనివారం ఆత్మకూరు నుంచి సిద్దరాంపురం బైపాస్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంప చెట్లను తొలగించారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, నాయకులు శివారెడ్డి, అంజినప్ప, బాషా, శేఖర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ భార్గవి

ఆత్మకూరు: స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారికి పరీక్షలు చేసి, మందులు అందించారు. విద్యార్థినులకు వైద్య సిబ్బంది ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీమారోజ్, డాక్టర్ భార్గవి, సీహెచ్‌ఓ ప్రీతి, వైద్య సిబ్బంది రమణమ్మ, అలివేలమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక టౌన్ బ్యాంకులో శాశ్వత లోక్ అదాలత్ అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా ప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. అనేక తగాదాల్లో కోర్టుకు వచ్చిన కేసుల్లో సత్వర పరిష్కార మార్గం లోక్ అదాలత్ అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, లీగల్ అడ్వైజర్ బండి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

పార్కులను ఆహ్లాదకరంగా ఉంచండి

అనంతపురం కార్పొరేషన్: పార్కులను ఆహ్లాదకరంగా ఉంచాలని నగరపాలక సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ప్రసన్నలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. శనివారం నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డు మార్గంలో ఉన్న కళారామం, శారదానగర్, తదితర పార్కులను ఆమె పరిశీలించారు. పార్కుల్లో చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించాలన్నారు. అనంతరం విద్యుత్‌నగర్ నుంచి నవోదయ కాలనీకు వెళ్లే మార్గంలో ఉన్న డివైడర్ల మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్



పైప్‌లైన్ కొలతలు వేయిస్తున్న అధికారులు

రాప్తాడు: ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి, నీటి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ తెలిపారు. మరూరు పంచాయతీలోని చాపట్లలో తాగునీరు లేక, కొంతకాలంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 14న వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి గ్రామ సమీపంలో బోరు వేయించారు. దాదాపుగా 3 ఇంచుల నీరు పడడంతో గ్రామంలో తాగు నీటి సమస్య తీరింది. శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతి ఇంటికీ కుళాయి వేసేందుకు పైప్‌లైన్ కొలతలు తీసుకున్నారు.

ఆనందంతో శేష జీవితం

సందర్భం నేడు పెన్షనర్ల దినోత్సవం

అనంతపురం కల్చరల్: అవసాన దశ.. అలసిన మనసులు.. ఆనందంగా ఆస్వాదించాల్సిన సమయం.. అంతరాలు లేని అనురాగం.. తరాలకు సరిపడా అనుభవం.. సేవలు అ'విశ్రాంత'ం..వారి మార్గం భావితరాలకు ఆదర్శం. ప్రభుత్వ రంగంలో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికంటూ ఏడాదిలో ఒక రోజును కేటాయించారు. పెన్షనర్ల కార్యక్రమాల నిర్వహణ కోసం అనంతపురంలో 1981లో ఎన్జీఓ హోం ఆవరణలో పెన్షనర్ల హోం ఏర్పాటైంది. ఇక్కడ చెస్, క్యారమ్స్ వంటి ఆటలతో పాటు ప్రతి పదిహేనురోజులకొకసారి ఆధ్యాత్మిక, ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిద్ధాంత వైరుధ్యాలున్న కొంత మంది పెన్షనర్లు 2019లో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం పేరిట మరొక సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఏటా డిసెంబరు 17న వచ్చే జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పలు చోట్ల సందడిగా కార్యక్రమాలు జరుగనున్నాయి.

నేడు సన్మానం

నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం పెన్షనర్ల దినోత్సవం ఘనంగా జరుగనుందని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ ప్రత్యేక సమావేశంలో తెలిపారు. బహుగ్రంథ కర్త డాక్టర్ పతికి రమేష్ నారాయణ ఆత్మీయ అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. సాహితీ, కళా ప్రదర్శనలు, అనంతరం పెన్షనర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. విశ్రాంత ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.

• తమ సమస్యలపై వాణిని వినిపించడానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు నేడు లలితకళాపరిషత్‌లో కలువనున్నారు. 75 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పెద్దన్న గౌడ్ తెలిపారు. ఆటపాటలతో సేద తీరే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు.



పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమాల నిర్వహణపై సమావేశమైన అసోసియేషన్ నాయకులు

వృద్ధాప్యం శాపం కాదు



వృద్ధాప్యం అనేది శాపం కాదు. అది ఒక జీవిత క్రమం మాత్రమే. జీవితాన్ని ఆనందమయంగా చేసుకోవడమనేది మన చేతుల్లోనే ఉంది. ప్రతి ఇంట్లోనూ సమస్యలు ఉంటాయి. పిల్లల గురించి అతిగా ఆలోచించడం కూడా మంచిది కాదు. వారి అభిప్రాయాలను గౌరవించినన్నాళ్లు సంబంధాలు సజావుగా ఉంటాయి. నా కూతురు, కొడుకు, భార్య చనిపోయారు. కానీ కుంగిపోకుండా పెన్షనర్ల సమస్యలపైనే దృష్టి నిలిపాను. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందిస్తోంది. మేము తరచుగా సాహిత్య, కవి సమ్మేళనాలు, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తుంటాం. – అబ్దుల్ సత్తార్, అధ్యక్షుడు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం

ఆధ్యాత్మికతతోనే ఆనందం



మనిషికి వయసు పెరిగిపోయే కొద్దీ అలజడి మొదలవడం సహజం. కానీ మంచి వ్యాపకం అంటూ ఉంటే ఎటువంటి అనారోగ్యాన్నైనా జయించవచ్చు. ముఖ్యంగా ఆధ్యాత్మికంగా సాగే ప్రయాణంలో నిరుత్సాహమనేది ఉండదు. నాకిప్పుడు 82 ఏళ్లు. ఇప్పటికీ అనేక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నాను. వృద్ధులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. – ఎంకే కృష్ణారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, అనంతపురం

నేత్రపర్వంగా అయ్యప్ప స్వామి పడిపూజ



పడిపూజలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో కొలువైన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. శనివారం అయ్యప్ప స్వామి పడిపూజకు వందలాది మంది తరలివచ్చారు. విశాఖపట్నం నుంచి వచ్చిన గురుస్వామి రేపల్లె తోట శివశంకరరావు, లక్ష్మీరెడ్డి నేతృత్వంలో సర్వాంగ సుందరంగా అయ్యప్ప 18 మెట్లను అలంకరించి, 36 కలశాలతో పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాగిన ప్రత్యేకపూజల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు. ఆలయ పునరుద్ధరణ గురించి ఈవో రమేష్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు సురేష్, చంద్ర, తిమ్మారెడ్డి, వెంకటస్వామి, సుబ్రమణ్యంతో చర్చించారు. అనంతరం గురుస్వాములు శ్రీనివాసులు, రంగాచారి మాట్లాడుతూ ఆదివారం నగరవీధుల్లో గ్రామోత్సవం ఉంటుందన్నారు.

అనంతకు చేరిన అయోధ్య అక్షింతలు



మారుతీనగర్ ఆలయానికి అయోధ్య అక్షింతలను తలపై మోసుకువస్తున్న భక్తజనం

అనంతపురం కల్చరల్: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలు శనివారం అనంతకు చేరుకున్నాయి. ఉదయం పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయస్వామి ఆలయం, సాయంత్రం మారుతీనగర్‌లోని శ్రీకోదండరామాలయానికి చేరుకున్న అక్షింతలకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. నగర వీధుల్లో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ పవిత్ర అక్షింతలను తలపై మోసుకువచ్చి పూజలు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ వచ్చేనెల 22న అయోధ్యలోని శ్రీరామ భవ్యమందిరంలో ప్రతిష్ఠలు సాగుతాయన్నారు. సోమవారం నగరంలోని శ్రీ హరిహర ఆలయంలో వందలాది కలశాలతో అయోధ్య రథానికి స్వాగతం పలుకుతూ పూజలు నిర్వహిస్తారన్నారు.

కమనీయం..శ్రీనివాస కల్యాణం



కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు



అలంకార సేవల్లో పూజలందుకున్న శ్రీనివాసుడు

అనంతపురం కల్చరల్: శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మార్గశిరంలో విశేష పూజలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం శ్రీవారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. స్థానిక హౌసింగ్‌బోర్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం వేదికగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవాన్ని అర్చకులు నీలకంఠశర్మ, కార్తీక శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. సంప్రదాయసిద్ధంగా సాగిన కల్యాణ ఘట్టాలను భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం మాంగళ్యధారణ, తీర్థప్రసాద వితరణ జరిగాయి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్‌ఐ సాగర్ శనివారం తెలిపారు. కొప్పలకొండలో పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు, ఒక ఇసుక ట్రాక్టర్ గార్లదిన్నె పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి మైన్స్ అధికారులకు అప్పగించామన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

గుత్తి: ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలని విద్యుత్ డీఈఈ రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హుసేన్ పీరా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ కొందరు అవసరమున్నా లేకున్నా రేయింబవళ్లు లైట్లు వేసి ఉంటారన్నారు. విద్యుత్ పొదుపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీఈ సాయి శంకర్, ఏఈ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ వేగవంతం చేయండి



ఏఓలతో సమావేశమైన ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: రబీ ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలని అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి ఆదేశించారు. శనివారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఆరు మండలాల ఏఓలతో సమావేశం నిర్వహించారు. రబీ పంటల నమోదు, ఈ కేవైసీ ప్రక్రియ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. జియో కోఆర్డినేట్ ఆధారంగా రైతు సాగు చేసిన పంట వివరాలు నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన విధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాలు (శ్యాంపిల్స్) గడువులోపు సేకరించి, ప్రయోగశాలలకు పంపాలన్నారు. ఆర్‌బీకేల్లో ఎరువులు నిల్వ ఉండేలా చూడాలన్నారు. వైఎస్సార్ ఆప్ ద్వారా ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అనంతపురం, రాప్తాడు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, కూడేరు ఏఓలు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



ప్రొఫెసర్లతో మాట్లాడుతున్న వీసీ సుధాకర్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ కంప్యూటర్ సైన్సెస్, ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. తరగతి గదులతో పాటు ప్రయోగశాలల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



ఎస్‌ఐ మునీర్ అహమ్మద్

రాప్తాడు: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ పేర్కొన్నారు. శనివారం రాప్తాడు ఎస్‌ఐగా మునీర్ అహమ్మద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ ఆంజనేయులు బొమ్మనహాళ్ మండలానికి బదిలీ చేశారు. అనంతపురం రూరల్ మండలంలో ఎస్‌ఐగా పని చేస్తున్న మునీర్ అహమ్మద్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలపై సత్వరం స్పందిస్తానని, ఏ సమస్య వచ్చినా తననే నేరుగా సంప్రదించాలని ఆయన కోరారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరానికి కృషి చేస్తానన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

యల్లనూరు: బుక్కాపురం క్రాస్ వద్ద మట్కా రాస్తున్న ముగ్గురు బీటర్లను పట్టుకున్నట్లు సీఐ సుబ్రమణ్యం శనివారం తెలిపారు. కొడవండ్లపల్లెకి చెందిన తిరుపతి నాయుడు, వాసాపురానికి చెందిన వెంకట శివుడు, తిమ్మంపల్లికి చెందిన ధన శేఖర్‌ను అరెస్టు చేసి రూ.11,200 నగదు స్వాధీనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

వీరన్నపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

యాడికి: వీరన్నపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ శ్రీరామ్ కుమార్ తన సిబ్బందితో వెళ్లి వైద్య సేవలు అందించారు. మొదట 53 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి రోగుల వివరాలను సేకరించి, వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యం అందిస్తున్నామన్నారు. అవసరమైన రోగులను ఆరోగ్య కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



38వ డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం 38వ డివిజన్ పరిధిలో రూ.25 లక్షల వ్యయంతో చేస్తున్న సీసీ రోడ్డు, కాలువ నిర్మాణ పనులు మేయర్ పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీర్లను ఆరా తీశారు. ఏఈ శంకర్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగుల 'హరివిల్లు'



'హరివిల్లు' కార్యక్రమంలో వివిధ పోటీలు



అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక రామ్‌నగర్‌లోని క్రిసెంట్ పాఠశాలలో శనివారం 'హరివిల్లు' పేరుతో జరిగిన వినూత్న కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యాసంస్థల చైర్మన్ కేఎం షఫీఉల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఉన్నతి, డాక్టర్ నవ్యరెడ్డి, డాక్టర్ ఫౌజియా, డాక్టర్ ఆరిఫ్ మాట్లాడుతూ చిన్నారులలో సహజంగా దాగి ఉండే ప్రతిభను ఇలాంటి కళా ప్రదర్శనల ద్వారా వెలుగులోకి తేవచ్చన్నారు. వైస్ చైర్మన్ షమీం షఫీ ఉల్లా, హెచ్‌ఎం వెంకటేష్ ఫ్యామిలీ రెయిన్‌బో పేరిట విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌కు, తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

అనంతపురం: క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఆర్జేడీ డైరెక్టర్ కృష్ణవేణి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, అనంతపురంలో రెండు రోజులుగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన డిప్లమో విద్యార్థుల మధ్య నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆర్జేడీ డైరెక్టర్ కృష్ణవేణి హాజరై మాట్లాడారు. అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన కే మహిత, కే అజిత్‌కుమార్ సత్తా చాటి తన వ్యక్తిగత విభాగంలో ఛాంపియన్‌గా నిలిచారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఓటరు జాబితా సర్వే పరిశీలన



రహమత్‌నగర్‌లో ఓటరు జాబితా సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: ఓటరు జాబితా సర్వేను నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి పరిశీలించారు. శనివారం నగరంలోని రహమత్‌నగర్‌లో జరుగుతున్న ఓటరు జాబితా సర్వేను కమిషనర్ పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఎంత మంది ఫాం-7కు దరఖాస్తు చేసుకున్నారు అని ఆరా తీశారు. మృతి చెందిన ఓటర్లు, అడ్రస్ మార్పు, తదితర వాటిని నిశితంగా పరిశీలించాలన్నారు. నిర్దేశిత సమయంలో సర్వేను పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని బీఎల్‌ఓలను కమిషనర్ హెచ్చరించారు.

కోర్టు కేసులను నిర్లక్ష్యం చేయొద్దు

నగరంలోని వివిధ ప్రాంతాల్లోని వివాద స్థలాలకు సంబంధించిన కోర్టు కేసులను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని కమిషనర్ భాగ్యలక్ష్మి టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ విభాగంలో కమిషనర్ సమావేశం అయ్యారు. 2005 నుంచి ఇప్పటి వరకు వివిధ కేసులకు సంబంధించిన ఫైళ్లపై కమిషనర్ ఆరా తీశారు. సమావేశంలో ఏసీపీ మారుతీప్రసాద్, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన వెంకటేశులు, వడ్డే పృథ్వీ

ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. సిద్దరాంపురానికి చెందిన వెంకటేశులు, వడ్డే పృథ్వీ శనివారం ఉదయం బైక్‌పై ఆత్మకూరు వచ్చారు. తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆత్మకూరు సమీపంలోని బైపాస్ నుంచి సిద్దరాంపురం రోడ్డు పైకి వెళ్తుండగా అనంతపురం నుంచి అతివేగంతో వస్తున్న కారు ఢీకొనడంతో వెంకటేశులు, వడ్డే పృథ్వీ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు వృథా కాకుండా చూసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అందించే తాగునీరు వృథా కాకుండా సిబ్బంది చూసుకోవాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రామమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో నీటి సరఫరా విభాగం సిబ్బందితో ఆయన సమావేశం అయ్యారు. కొన్ని ప్రాంతాల్లో నీటిని వృథాగా కాలువల్లోకి వదులుతున్నారన్న ఫిర్యాదులన్నాయని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. నీరు వదిలే బాధ్యతను రెగ్యులర్ ఫిట్టర్‌లకే అప్పగించాలని ఈఈ సూర్యానారాయణ, డీఈ సుభాష్‌లను ఆయన ఆదేశించారు. సమావేశంలో ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.